తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ ఆదివారం 08 - 03 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజీలు : 3

## వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం

### మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య





ప్రజావారధి/మోత్కూరు

మున్సిపాలిటీలోని వార్డుల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని, ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తేవాలని మోత్కూరు మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం మోత్కూరు మున్సిపాలిటీలోని 7వ వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వార్డుల్లోని సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్యక్రమం చేపట్టిందన్నారు. తక్షణ సమస్యలైన తాగునీరు, మురికి కాల్వల శుభ్రత, వీధి లైట్లను అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి చేయిస్తారన్నారు. 7వ వార్డులో సమస్యలను పరిష్కరించి అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గనగాని శైలజనర్సింహ, మున్సిపల్ కమిషనర్ కె.సతీష్ కుమార్, మేనేజర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో మహిళా అభివృద్ధి సాధించాలి




ప్రజావారధి/మోత్కూరు

మహిళలు సామాజిక ఆర్థిక రాజకీయ రంగాల్లో సాధికారిత సాధించాలని, అప్పుడే సమాజంలో లింగ వివక్షత నిర్మూలించబడుతుందని మోత్కూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో మహిళలు అధిక శాతం ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడడం మహిళా సాధికారితకు నిదర్శనమని, ఈ మార్పు హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఏఏపీసీ చైర్మన్ దబ్బేటి శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పాలడుగును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం

## సర్పంచ్ అంతటి భగవంతు





ప్రజావారధి/మోత్కూరు

పాలడుగు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ అంతటి భగవంతు అన్నారు. మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో శనివారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పాఠశాలలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. పాఠశాల ఆవరణను శుభ్రం చేసి, ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మిడిదొడ్డి శైలజ, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, హెచ్‌ఎం కమలాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# దాచారం హైస్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవం




ప్రజావారధి/మోత్కూరు

మోత్కూర్ మండలం దాచారం ఉన్నత పాఠశాలలో శనివారం స్టూడెంట్స్ స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. ప్రధానమంత్రిగా రాకేష్, ముఖ్యమంత్రిగా దుర్గాప్రసాద్, కలెక్టర్‌గా ఝాన్సీ, ఆర్జేడీగా రామ్‌చరణ్, జిల్లా విద్యాధికారిగా వర్షిత, సర్పంచ్‌గా నందుశ్రీ, ప్రధానోపాధ్యాయులుగా దీక్షిత వ్యవహరించి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం వెంకటేశం, ఉపాధ్యాయులు నర్మద, వీరయ్య, ఆనందకుమార్, నాగరాజు, శ్రీనివాస్, సైదులు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# ముశిపట్ల రోడ్డును మరమ్మతు చేయాలని సీపీఎం నిరసన



- కంకర తేలి గుంతలతో అధ్వానంగా మారిన రోడ్డు
- ప్రమాదాలు జరిగినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు
- వెంటనే రోడ్డు మరమ్మతు చేపట్టాలి
- సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు నుంచి ముశిపట్ల, దత్తప్పగూడెం వెళ్లే బీటీ రోడ్డు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా తయారైందని, రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు తెలిపారు. కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా మారిన ముశిపట్ల రోడ్డును మరమ్మతు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దత్తప్పగూడెం నుండి ముశిపట్ల, ఆరెగూడెం గ్రామాల నుండి నిత్యం ప్రజలు వివిధ పనుల కోసం మోత్కూర్ మండల కేంద్రానికి వెళ్లడానికి ఈ రోడ్డుపై నుంచే వెళ్లాలని, రోడ్డు పూర్తిగా దెబ్బతిని కంకర తేలి, పెద్ద పెద్ద గుంతలు పడి ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే ఒళ్లు నొప్పులు వస్తున్నాయని, ఎదురెదురుగా వచ్చే వాహనాలు గుంతలను తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నాయని, వాహన దారులు గాయపడుతున్నారని తెలిపారు. అధ్వానంగా మారిన ఈ రోడ్డు సమస్యను అధికారులకు వివరించినా ఇటు పాలకులు గాని అటు అధికారులు గాని పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ముశిపట్ల గ్రామశాఖ కార్యదర్శి పాటి శ్రీనివాసరెడ్డి, మండల కమిటీ సభ్యులు భువనగిరి యాదయ్య, వెండి యాదగిరి, కొంపల్లి గంగయ్య, చింతకింది సోమరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# రైతులు ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

**ప్రజావారధి/మోత్కూరు**

రైతులు మారుతున్న కాలానుగుణంగా ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంచుకుని అధిక దిగుబడులు సాధించాలని కేవీకే శాస్త్రవేత్త నర్సింహారెడ్డి అన్నారు. మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో శనివారం ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక యంత్ర పరికరాలు, వాటి వాడకంపై అవగాహన పెంచుకోవా లన్నారు. సహజ వనరును వినియోగించుకుని పంటల్లో వచ్చే చీడపీడల నియంత్రించుకోవచ్చని, పంటల అధిక దిగుబడిని పెంచడం, ఫార్మ్ యార్డ్ మాన్యూర్, ఫాస్ఫరస్ సాల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా ఉపయోగం ద్వారా మొక్కల వేర్లను బలపర్చడం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంతటి భగవంతు, ఏవో కీర్తి, ఏఈవోలు గోపీనాథ్, సింహప్రసాద్, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ ముక్కంల స్వాతి, కొంగరి స్వాతి తదితరులు పాల్గొన్నారు.